RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | శుక్రవారం 11 అక్టోబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 151 | పేజీలు: 4 | వెల: రూ.5/-





## కొండా సురేఖపై కేటీఆర్ దావా

నాగార్జున కేసులో సురేఖకు కోర్టు నోటీసులు

3లో..

మూసీ ప్రక్షాళన పేరుతో

# ఇల్లు కోల్పోతున్న బాధితులకు న్యాయం చేయలేరా?

## కోదండరాం, కే.కేశవరావులకు బాధ్యత లేదా?







- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు, ప్రొఫెసర్ హరగోపాల్‌తో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలి
- ఇల్లు కోల్పోతున్న మూసీనది పరివాహిక బాధితులకు పక్కా ఇళ్ల, ప్రభుత్వ పత్రాలు ఇవ్వాలి.
- ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు ఎమ్మెల్సీ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్ తో వెంటనే పత్రికా సమావేశం ఏర్పాటు చేసి బాధితులకు భరోసా కల్పించాలి.
- మూసి బాధిత కుటుంబాలకు పక్క ఇల్లు తో పాటు ఉపాధి, పిల్లల విద్య, వైద్యం పై స్పష్టత ఇవ్వాలి
- మూసి ప్రక్షాళన, సుందరీకరణ కోసం లక్ష 50 వేల కోట్లు ఎందుకు అవసరం వస్తుంది అనే విషయం ప్రభుత్వం ప్రజలకు స్పష్టంగా తెలపాలి
- నిధుల సమీకరణ ఏ రకంగా సమీకరిస్తున్న విషయం తెలంగాణ సమాజానికి తెలిపాలి
- మూసి సుందరీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ఏమిటో తెలపాలి
- మూసి ప్రక్షాళన సుందరీకరణ లపై తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయిన అంశాలు, ప్రతీది రాతపూర్వకంగా ఉన్న విషయాలు తెలంగాణ సమాజానికి తెలపాలి
- మూసి 56 కిలోమీటర్ల పొడవున వస్తున్న జాతీయ, అంతర్జాతీయ ప్రాజెక్టుల విషయాలు అన్ని ప్రజల ముందు ఉంచాలి

ప్రభాత సూర్యుడు పత్రిక చీఫ్ ఎడిటర్ కస్బా శంకర్రావు ప్రత్యేక వ్యాసం

2



## రతన్ టాటాకు కన్నీటి వీడ్కోలు

వర్లి శ్మశాన వాటికలో ముగిసిన అంత్యక్రియలు

అశ్రునయనాల మధ్య రతన్ టాటా అంత్యక్రియలు

మహారాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాలతో నిర్వహణ

అమిత్ షా, సిఎం షిండే, పారిశ్రామిక దిగ్గజాల నివాళి

ముంబై, అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): పారిశ్రామిక దిగ్గజం,టాటా గ్రూప్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా అంత్యక్రియలు అశ్రు నయనాల మధ్య పూర్తయ్యాయి. మహారాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాలతో నిర్వహించారు. అంతకుముందు పలువురు ప్రముఖులు రతన్ టాటా పార్థివదేహం వద్ద నివాళి అర్పించారు. ప్రజల సందర్శన కోసం టాటా పార్థివదేహాన్ని ఆయన నివాసం నుంచి ఎన్‌సీపీఏ గ్రౌండ్‌కు తరలించారు. అనంతరం గురువారం సాయంత్రం అక్కడ నుంచి వర్లీ వరకు కొనసాగిన అంతిమయాత్రలో భారీ సంఖ్యలో ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు. వర్లీ శ్మశానవాటికలో రతన్ టాటా పార్థివదేహానికి అంత్యక్రియలు పూర్తిచేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిర్వహించింది. అయితే, పార్సీ మతస్థుడైనప్పటికీ ఎలక్ట్రిక్ విధానంలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. కేంద్రహోంమంత్రి అమిత్ షా, కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, సిఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటి సిఎం ఫడ్నవీస్, శక్తికాంద్ దాస్, అంబానీ దంపతులు, ఇతర ప్రముఖులు నివాళి అర్పించారు. హిందూ, ముస్లింల మాదిరి కాకుండా పార్సీల అంత్యక్రియలు భిన్నంగా ఉంటాయి. మానవ శరీరాన్ని ప్రకృతి బహుమతిగా భావిస్తారు. అందుకే శరీరాన్ని తిరిగి ఇచ్చే సంప్రదాయాన్ని పాటిస్తారు. దహనం, ఖననం చేయడం వల్ల ప్రకృతి వనరులైన నీరు, గాలి, అగ్ని కలుషితం అవుతాయని జొరాస్ట్రియన్‌ల విశ్వాసం. అందుకే ప్రత్యేక విధానంలో అంత్యక్రియలు చేస్తారు. అంత్యక్రియలకు ముందు పార్సీ సంప్రదాయం ప్రకారం ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం పార్థివదేహాన్ని ..మిగతా 2లో



## ఆదాయ మార్గాలపై ఫోకస్ చేయాలి

### సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): వార్షిక లక్ష్యాలకు అనుగుణంగా ఆదాయ సమీకరణపై వివిధ శాఖల అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆదాయం సమకూర్చే శాఖల లక్ష్యాలపై ఉన్నతాధికారులతో సమీక్షించారు సీఎం. వార్షిక లక్ష్యాలను చేరుకోవడంలో శాఖల పనితీరును మెరుగుపరుచుకోవాలని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వల్ల రాష్ట్రానికి అప్పుల భారం పెరిగిందని, ఆదాయ మార్గాలపై దృష్టి సారించింది కాంగ్రెస్ సర్కార్. ఈ క్రమంలోనే అధికారులతో వరుస భేటీలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆర్థిక మంత్రి భట్టి, పలు శాఖల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఖాజానాకు ఆదాయం పెంచేందుకు నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. లీకేజీలను అరికడుతూ, ఆదాయం పెంపుపై దృష్టి సారించాలని చెప్పారు. అక్రమ మద్యం, ఇసుక అమ్మకాలు, పన్నుల ఎగవేతను కట్టడి చేసేందుకు సిద్ధమయ్యారు. ఇదే క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించి, అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.

## ఊరూవాడా సద్దుల బతుకమ్మ సంబరాలు

ట్యాంక్‌బండ్‌పై వైభవంగా బతుకమ్మ సంబరం.. పలు జిల్లాల్లో వేడుకగా సాగిన ఉత్సవాలు



హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే బతుకమ్మ వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలంతా ఒక్కచోట చేరి ఆడిపాడుతూ సంబురాలు చేసుకున్నారు. మహిళలంతా తీరొక్క పువ్వులతో భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పేర్చారు. బతుకమ్మ సంబురాలతో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాలు వెలుగులీనాయి. వేలాది మందితో బతుకమ్మ ర్యాలీ నిర్వహించారు. అలాగే ట్యాంక్ బండ్ పరిసరాలు మహిళల సందడితో కళకళ లాడింది. ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూడి సిఎం మల్లు భట్టి విక్రమార్కలు సంబురాలకు ..మిగతా 2లో

## గ్రూప్-1 పరీక్షలకు వర్గీకరణ వర్తింపచేయాలి

### అప్పడే సిఎం రేవంత్‌ను నమ్ముతాం: మందకృష్ణ



హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): మాదిగలను నమ్మించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని ప్రకటనలు చేసినా, నమ్మే పరిస్థితి లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయకుండానే 11వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్లకూ వర్గీకరణ వర్తింపజేస్తామని చెప్పి, అమలు చేయకుండానే ..మిగతా 2లో




## రేవంత్ పాలనలో రైతులకు నిద్ర లేదు

ఇచ్చిన హామీల కోసం రోడ్డెక్కుతున్నారు

మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నదాతలను కష్టాలను వెంటాడుతూనే ఉన్నాయి. రేవంత్ పరిపాలనలో రైతు కంటి నిండా నిద్రపోయే పరిస్థితి లేకుండా పోయింది. 24 గంటల ఉచిత విద్యుత్ కోసం పోరాటం, రైతుబంధు కోసం పోరాటం, రుణమాఫీ కోసం పోరాటం.. ఇలా అనేక రకాలుగా అన్నదాతలు రోడ్డెక్కుతూనే ఉన్నారు. చివరకు వరద పాలైన పంటలకు నష్ట పరిహారం చెల్లించడంలో కూడా రైతులను రేవంత్ ప్రభుత్వం నిలువునా మోసం చేసింది. వరదల్లో నిండా మునిగిన రైతాంగాన్ని.. వంచనతో మళ్లీ రేవంత్ సర్కార్ ముంచిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటే.. వేల ఎకరాలకే అరకొర సాయం చేసి చేతులు దులుపుకోవడం అన్యాయం అని మండిపడ్డారు. 4.15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పిన ..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# తెలుగు రాష్ట్రాలకు కేంద్ర పన్నుల వాటా విడుదల

## ఎపికి రూ. 7,211 కోట్లు, తెలంగాణకు రూ. 3,745 కోట్లు

హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): కేంద్ర పనుల్లో రాష్ట్రాలకు చెల్లించాల్సిన వాటాలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం విడుదల చేసింది. ఇందులో తెలుగు రాష్ట్రాలకు కలిపి దాదాపు రూ.11 వేల కోట్లు విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు రూ. 7,211 కోట్లు, తెలంగాణకు రూ. 3,745 కోట్లు విడుదలయ్యాయి. అన్ని రాష్ట్రాలకు కలిపి రూ.1,78,173 కోట్లు రిలీజ్ చేశారు. అక్టోబరు, 2024లో చెల్లించాల్సిన సాధారణ వాయిదాకు అదనంగా ఒక ముందస్తు వాయిదా వేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ముందస్తు వాటాగా రూ. 89,086.50 కోట్లతో కలిపి మొత్తం రూ. 1,78,173 కోట్లు రిలీజ్ చేసింది. పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రాలు మూలధన వ్యయాన్ని వేగవంతం చేయడానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని కేంద్రం తెలిపింది. రాష్ట్రాలు అభివృద్ధి, సంక్షేమ వ్యయాలకు ఆర్థిక సాయం అందించడానికి నిధులు విడుదల చేసినట్లు తెలిపింది.

### మూసీ ప్రక్షాళన పేరుతో ఇల్లు కోల్పోతున్న బాధితులకు

# న్యాయం చేయలేరా?



హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): ప్రభుత్వ సలహాదారుగా కే కేశవరావు, తెలంగాణ మేధావుల ప్రతినిధిగా ఉన్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం లకు మూసి పరివాహిక ప్రాంతంలోని ఇల్లు కోల్పోతున్న బాధితుల బాధలు పట్టవా?? బాధితుల ఆర్తనాదాలు, బాధితుల తిట్లు, శాపనార్ధాలు వినపడడం లేవా? వాళ్ల శాపనార్ధాలు ప్రభుత్వానికి మంచి జరుగుతాయా? ప్రతిరోజు ప్రతి మీటింగులో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రభుత్వ సలహాదారు కేశవరావు ల పేర్లు లేకుండా వాళ్లను జపం చేయకుండా సీఎం రేవంత్ రెడ్డి ఏ సమావేశంలో కూడా మాట్లాడలేని పరిస్థితిని చూస్తూనే ఉన్నాము. సామాజిక ఉద్యమాలను నడిపిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, జర్నలిజం బ్యాక్ గ్రౌండ్ నుండి వచ్చిన కే. కేశవరావు వీరిద్దరూ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ మూసినది పరివాహక ప్రాంత బాధితుల కుటుంబాలకు ఏమి చేయలేని "నిస్సహాయ స్థితిలో" ఉన్నారని ప్రజలు భావించాల్సి వస్తుంది. వీరి ఇద్దరి చేతిలో అన్ని హంగులు ఉన్నప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి తో ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని, మూసీనది బాధితుల విషయంలో చర్చోప చర్చలు చేసి ప్రభుత్వం వారికి అన్ని రకాల సహాయ సహకారాలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి పై ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదని ప్రజలు భావించాల్సి వస్తుంది. ప్రభుత్వ పరంగా హైడ్రాకు అన్ని రకాల అధికారులు ఇస్తూ చట్టబద్ధత కల్పించినట్టే, ఇల్లు కోల్పోతున్న బాధితుల కుటుంబాలకు కూడా ప్రభుత్వపరంగా బాధితులకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డి సర్కార్ కు లేదా?? అని బాధితుల నుండి బలమైన విమర్శ వస్తుంది. ప్రజల నుండి కూడా ప్రశ్నల వర్షాలు వస్తున్నప్పటికీ ప్రభుత్వ సలహాదారుగా కే కేశవరావు తెలంగాణ మేధావుల ప్రతినిధిగా ఉన్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం లు మౌనం వీడాల్సిన పరిస్థితి ఉంది. ఈ విషయంలో నోరు విప్పక మౌనంగా ఉంటున్నారంటే వీరిద్దరితో పాటు ప్రభుత్వాన్ని విధానాన్ని కూడా అనుమానించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, కేశవరావు లు ఒక్క అడుగు ముందుకు వేసి ఇల్లు కోల్పోతున్న బాధితులలో, ప్రజలలో ఉన్న కన్ఫ్యూజన్ తొలగించాల్సిన అవసరం ఉన్నది. అందుకే ప్రభుత్వ సలహాదారు అయిన కే కేశవరావు తెలంగాణ మేధావుల ప్రతినిధి అయిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం లు వెంటనే పత్రికా సమావేశం ఏర్పాటు చేసి మూసి పరివాహక ప్రాంతంలోని ఇల్లు కోల్పోతున్న బాధిత కుటుంబాల విషయంపై తెలంగాణ ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోబోతున్నదో?? అలాగే వారికి ఎటువంటి భరోసా ఇవ్వబోతున్నదో??? ముఖ్యంగా ఈ విషయంలో కీలక వ్యక్తులైన వీరితోపాటు ప్రొఫెసర్ హరగోపాల్ ను కూడా కలుపుకొని బాధితుల పక్షాన బాధ్యత తీసుకొని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇచ్చి, బాధితుల పక్షాన ఉంటూ వారికి న్యాయం జరిగేటట్లు చేసి పెద్దఅన్నల పాత్ర పోషించాల్సిన అవసరం ఉన్నది. మూసినది పరివాహక ప్రాంతంలో ఇల్లు కోల్పోతున్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే భరోసా ఏమిటి,?? అనే విషయాలు స్పష్టంగా ప్రజల ముందు పెట్టాల్సిన అవసరం ఉన్నది. హైడ్రాకు ప్రభుత్వపరంగా చట్టబద్ధత కల్పించినట్టే, మూసీనది పరివాహిక బాధిత కుటుంబలకు భరోసా మాటలు కాకుండా "ప్రభుత్వ పత్రాల" తో బాధితులకు భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉన్నది. ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, కే కేశవరావు వీరు ముగ్గురు మధ్య వర్తిత్వం నిర్వర్తించి, బాధితుల కుటుంబాల సమావేశ ఏర్పాటు చేసి వారి ఆవేదన, బాధను, సావధానంగా విని ఇల్లు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయంగా పక్కా ఇల్లు ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందనే భరోసా వాళ్లకు కల్పిస్తే మూసి పరివాహక ప్రాంత సుందరీకరణకు ఎటువంటి ఆటంకాలు ఎదురుపడవు. ప్రభుత్వపరంగా ఇటువంటి ప్రయత్నం జరగలేదు. కాబట్టే ప్రతిపక్షాలు అవకాశం కోసం కాచుకొని ఉన్నాయనే విషయాన్ని గ్రహించాలి. గత కెసిఆర్ 10 సంవత్సరాల ప్రభుత్వంలో ఇదే కేశవరావుకు ప్రభుత్వ సలహాదారు అనే కిరీటమిచ్చి సమావేశాలలో బుద్ధ విగ్రహముల కూర్చోబెట్టి అన్ని తానై కనీసం మాట్లాడడానికి అవకాశం లేకుండా ఎటువంటి అధికారాలు లేకుండా, ప్రభుత్వంలో ఒక జీవచ్ఛవంలాగా ఉండి బాధలు, అవమానాలు అనుభవించిన కేశవరావుకు ఈ అన్ని విషయాలు తెలవవా? అని జర్నలిస్టు మిత్రులు అనుకుంటున్నారు. ప్రొఫెసర్ కోదండరాం అంటే సీఎం రేవంత్ రెడ్డికి ఎనలేని మక్కువ, ప్రేమ ఉన్న సంగతి జగమెరిగిన సత్యం. ప్రభుత్వ సమావేశాలలో కానీ, పార్టీ సమావేశాలలో కానీ, ప్రజల సమావేశాలలో కానీ, వీరిద్దరి పేర్ల జపం లేకుండా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడకుండా ఉన్న సమావేశాలు ఉన్నాయా??? అని ప్రజలు అనుకుంటున్నారు. ఇంత చక్కటి అవకాశం ఉన్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు తోపాటు ప్రొఫెసర్ హరగోపాలు ను కూడా భాగస్వామ్యం చేసుకొని మూసి నది పరివాహక ప్రాంత బాధితుల కుటుంబాలకు ఈ ముగ్గురు కలిసి మూడు చక్రాలు తిప్పి అట్టి కుటుంబాలకు పక్కా ఇళ్లతో పాటు, ఉపాధి, పిల్లల విద్యా విషయాలు, ఆరోగ్య విషయాలు అన్ని కూలంకషంగ చర్చించి, ప్రభుత్వ పెద్దలకు నివేదిక ఇచ్చి, చెప్పి, ఒప్పించి ప్రభుత్వం పై ఒత్తిడి పెంచి అట్టి బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తేనే ఈ సమస్యకు ఒక శాస్త్రీయ పరిష్కారం దొరుకుతుందనే విషయం ప్రభుత్వ పెద్దలు కూడా గుర్తించితే మంచిది.



సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కారాములు చేతుల మీదుగా పక్క ఉద్యోగ పత్రాలను కార్మికులకు అందజేస్తున్న దృశ్యం

### సీఐటీయూ ఆధ్వర్యంలో కిర్బీ పరిశ్రమలో

# 69 మంది కార్మికులకు పక్కా ఉద్యోగాలు

## సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

పటాన చెరువు, అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): పటాన చెరువు మండలం పాషమైలారం పాలశ్రామిక ప్రాంతంలో అంతర్జాతీయంగా పేరెన్నిక గన్న కిర్బీ పరిశ్రమలో 69 మంది టెంపరరీ కార్మికులకు శాశ్వత ఉద్యోగాలు కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి పక్క ఉద్యోగాలు ఇప్పించామని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు తెలిపారు. గురువారం కిర్బీ గేట్ మీటింగ్లో మాట్లాడుతూ కంపెనీ యాజమాన్యంతో చర్చోప చర్చలు చేసి మధ్యస్థంగా 69 మంది టెంపర్ వరి కార్మికులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇప్పించడంలో సిఐటియు కృషి చాలా ఉన్నదని అన్నారు. ఈరోజు వారికి ఉద్యోగ నియామక అపాయింట్మెంట్ లెటర్స్ ను 69 మంది కార్మికులకు ఇప్పిచ్చినట్లు తెలిపారు. పారిశ్రామిక ప్రాంతాలలో సిఐటియు కార్మికుల సమస్యలను మోసుకుంటూ ఎప్పటికప్పుడు ఆయా కంపెనీ యాజమాన్యాలతో ప్రజాస్వామ్య బద్దంగా కంపెనీల చట్టం ప్రకారం చర్చలు జరిపి కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు సిఐటియు పరిష్కరిస్తుందని అన్నారు. ఇదే పరిశ్రమలో గతంలో 44 మంది కార్మికులకు పక్కా ఉద్యోగాలు ఇప్పించామని అన్నారు. ఉద్యోగాల భద్రత విషయంలో కార్మికులకు కార్మిక చట్టాల ప్రకారం రావలసిన అన్ని రకాల సదుపాయాల విషయంలో సిఐటియు ముందు ఉంటుందని అన్నారు. కార్మికులందరూ ఐక్యమత్యంతో సిఐటియును ఆదరించాలని అన్నారు. కిర్బీ పరిశ్రమ డైరెక్టర్ ఫిలిఫస్ మాట్లాడుతూ పరిశ్రమ అభివృద్ధికి కార్మికులందరూ కృషి చేయాలని అన్నారు. పరిశ్రమలు బాగా పనిచేస్తేనే కార్మికులకు సౌకర్యాలు మెరుగుపడతాయని కావలసిన బెనిఫిట్స్ ను ఆయా కంపెనీలు అందజేస్తాయని అన్నారు కొత్తగా అపాయింట్మెంట్ లెటర్స్ తీసుకున్న కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్మికులకు అపాయింట్మెంట్ లెటర్స్ ను సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు, కిర్బీ డైరెక్టర్ ఫిలిఫస్, హెచ్ ఆర్ వైస్ ప్రెసిడెంట్ రాజమహేంద్ర చేతుల మీదుగా పక్కా ఉద్యోగ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కే రాజయ్య, యూనియన్ నాయకులు బిఎస్ రాజు, నాగ ప్రసాద్, తలారి, శ్రీనివాస్, మల్లేష్ ఏడుకొండలు, లక్ష్మణ్, హెచ్ ఆర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



# ఊరూవాడా సద్దుల బతుకమ్మ సంబరాలు

మొదటి పేజీ తరువాయి...

హాజరయ్యారు. వందలాది మంది మహిళలు 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆడిపాడారు. వేలాది మంది మహిళలతో హనుమకొండ పద్మాక్షి అమ్మవారి గుండం కిక్కిరిసిపోయింది. వికారాబాద్ జిల్లా తాండూరులో మహిళలు భక్తి శ్రద్ధలతో బతుకమ్మ ఆడారు. కరీంనగర్, నల్గొండ, అదిలాబాద్ తదితర జిల్లాల్లో బతుకమ్మ సంబరాలు కోలాహలంగా సాగుతున్నాయి. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ సంబురాలు నేటితో ముగిసాయి. తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. గురువారం చివరి రోజైన సద్దుల బతుకమ్మ కావడంతో తెలంగాణ గల్లీగల్లీ నుంచి హైదరాబాద్ బస్తీల వరకు వేడుకలు ఆకాశాన్ని అంటాయి. ఇటు ట్యాంక్‌బండ్ పరిసరాల్లో మంత్రి సీతక్క సహ పలువురు మహిళ నేతలు, మహిళలు, యువతులు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనగా.. మరోపక్క ఊరూవాడా పూలవనంలా మారిపోయింది. మహిళలు, యువతులు, చిన్నారుల ఆటపాటలతో రాష్ట్ర వ్యాప్తంగా సందడి వాతావరణం నెలకొంది. అక్టోబర్ 2న ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఉత్సవాలు సద్దుల బతుకమ్మతో ముగుస్తున్నాయి. రాష్ట్ర ఆవిర్భావం నుంచే బతుకమ్మ సంబురాలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. దీంతోపాటు బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించి గౌరవించింది. బతుకమ్మల నిమజ్జనానికి ఊళ్లలో ఉండే చెరువులతో పాటు హైదరాబాద్ వాసులు తమ సమీప నీటి వనరులను ఉపయోగించుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు రాజ్‌భవన్‌లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సతీమణి సుధాదేవ్ పాల్గొన్నారు. గవర్నర్‌గా నియమితులైన తర్వాత తొలిసారి సంబురాలు జరుపుకుంటుండడంతో పూల పండుగ విశిష్టతను అధికారులు గవర్నర్ దంపతులకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మనకు పూర్వీకులు ఇచ్చిన గొప్ప ఆచారం, సంస్కృతీ బతుకమ్మ అన్నారు. భవిష్యత్ తరాలకు ఈ పండుగను అందించడమే మన బాధ్యత అని, చెరువులను కబ్జాలు కాకుండా కాపాడుకుందామని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఈ రోజు చెరువులు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని, చెరువులకు పూజలు చేసే పండుగ బతుకమ్మ అని, తెలంగాణ అంటేనే చెరువులు అని, బతుకమ్మ చెరువుల్లో నీరు తాగేదని, పొలాలకు నీరు అందించేదని ఆమె తెలిపారు. మన జీవన శైలి చెరువులపై ఆధారపడి ఉందని, హైదరాబాద్‌కు లేక్ సిటీ అని పేరు ఉండేదని, కానీ, ఈ రోజు అవి కనుమరుగు అయిపోయాయని ఆమె తెలిపారు. ఆటలు, పాటలు, బతుకమ్మకు పూజలు ఇది తరతరాలకు అందించాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# రతన్ టాటా మృతికి రాష్ట్రపతి, ప్రధాని సంతాపం

న్యూఢిల్లీ, అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): దిగ్గజ పారిశ్రామికవేత్త, టాటా గ్రూప్స్ గౌరవ చైర్మన్ రతన్ టాటా కన్నుమూశారు. వయోసంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన ముంబైలోని బ్రీచ్ క్యాండీ దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి 11.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. రతన్ టాటా మరణ వార్తతో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ, ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ సహా పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. రతన్ టాటా అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహిస్తామని మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దిగ్గజ వ్యాపారవేత్తకు నివాళి అర్పిస్తూ గురువారాన్ని సంతాప దినంగా ప్రకటించింది. అలాగే రతన్ టాటా మృతికి సంతాపం తెలుపుతూ జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ గురువారం సంతాప దినం ప్రకటించారు. రతన్ టాటా మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్మ సంతాపం వ్యక్తం చేశారు. భారత్ ఒక దిగ్గజ పారిశ్రామికవేత్తను కోల్పోయిందన్నారు. ఆయన చేసిన సేవలు ప్రపంచంలోని ఎందరికో స్ఫూర్తిదాయకమని ఎక్స్ వేదికగా ఆమె కొనియాడారు. రతన్ టాటా మరణం పట్ల ప్రధాని నరేంద్ర మోడీ సంతాపం తెలిపారు. రతన్ టాటా దూరదృష్టి ఉన్న వ్యాపార వేత్త అని మోడీ కొనియాడారు. ప్రతిష్టాత్మక వ్యాపార సంస్థలకు స్థిరమైన నాయకత్వం అందించారని, మెరుగైన సమాజం కోసం ఆయన కృషి చేశారన్నారు. వ్యాపారం, దాతృత్వంలో రతన్ టాటా శాశ్వత ముద్ర వేశారని ఏఐసిసి అగ్రనేత రాహుల్ ప్రశంసించారు. పారిశ్రామికవేత్త, గొప్ప మానవతావాదిని భారత్ కోల్పోయిందని బాధను వ్యక్తం చేశారు. రతన్ టాటా నిష్క్రమణ పారిశ్రామికరంగానికి, దేశానికి తీరనిలోటు అని అన్నారు. నిబద్ధత, విలువలకు కట్టుబడిన గొప్ప వ్యక్తి రతన్ టాటా అని ప్రశంసించారు.

# గ్రూప్-1 పరీక్షలకు వర్గీకరణ వర్తింపచేయాలి

మొదటి పేజీ తరువాయి...

టీచర్ పోస్టులు భర్తీ చేశారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి శాసనసభలో చెప్పిన మాటలకే విలువలేదని విమర్శించారు. శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తామంటే అనుమతి ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వమే కాదు.. రేవంత్ ప్రభుత్వం కూడా నిర్బంధాలతోనే నడుస్తోందని ఆరోపించారు. గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు వర్గీకరణ వర్తింపజేయాలని.. లేదంటే వర్గీకరణ తర్వాతే గ్రూప్-1 పరీక్ష నిర్వహించాలని, గ్రూప్-3 పరీక్షలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్-4 ఫలితాలు ఇప్పటికే 16 నెలలు ఆగాయని, వర్గీకరణ జరిగే వరకు మరో 2 నెలలు వాయిదా వేయాలని కోరారు. ఈ నెల 16న వరంగల్‌లో భారీ సమావేశం నిర్వహిస్తామన్న ఆయన.. ఆ సమావేశంలో అన్ని కమిటీల సభ్యులు పాల్గొంటారని అన్నారు. ఇప్పటివరకు ఆవేదనతోనే నిరసన చేశామని.. ఇకపై తమ ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

### రేవంత్ పాలనలో

# రైతులకు నిద్ర లేదు

మొదటి పేజీ తరువాయి...



మాటలు.. వ్యవసాయ శాఖ ఇచ్చిన నివేదిక వాస్తవం కాదా..? అని కేటీఆర్ నిలదీశారు. పంట నష్టం అంచనాలను తలకిందులుగా ఎందుకు మార్చేసారు..? ఏకంగా 3 లక్షల 35 వేల ఎకరాలు ఎట్లా ఎగిరిపోయాయి..? 79,574 ఎకరాలకే కంటి తుడుపుగా పరిహారం ఇచ్చి మమ అనిపించడం దారుణం..! అపార నష్టంతో అల్లాడుతున్న రైతుల ఆదుకునే విషయంలోనూ ఉదారంగా వ్యవహరించలేరా..? మానవత్వం ప్రదర్శించలేరా..? 5.20 లక్షల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందని కేంద్ర బృందానికి రాష్ట్రం రిపోర్ట్ ఇచ్చింది నిజం కాదా..? ఇప్పుడు ఇంత భారీ కోతలా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. పెట్టిన పెట్టుబడి కొట్టుకుపోయి.. రాళ్లు ఇసుక మేటలు వేసిన పొలాలను బాగుచేసుకోవడానికి మీరిచ్చే 10 వేలు ఏ మూలకూ సరిపోవు.. మరి అందులోనూ కుదింపులు చేయడం ఏమాత్రం సమంజసం కాదు..! అన్నదాత ఆపదలో వున్నప్పుడు ఆదుకోవడం.. ప్రభుత్వాల బాధ్యత..! ఆ బాధ్యత నుంచి తప్పించుకోకుండా నష్టం వాటిల్లిన ప్రతి ఎకరానికి పరిహారం అందించండి..! రుణమాఫీలో దగా జరిగింది.. రైతు భరోసా జాడా పత్తా లేదు.. వరదలు ముంచెత్తి నష్టాల్లో.. కష్టాల్లో కూరుకుపోయిన రైతులకు అండగా నిలవట్లేదు..! అన్నదాతపై ఎందుకీ వివక్ష..? అని రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ నిలదీశారు.

# రతన్ టాటాకు కన్నీటి వీడ్కోలు

మొదటి పేజీ తరువాయి...

అంత్యక్రియల కోసం నిర్దేశిరచిన ప్రత్యేక ప్రదేశానికి తీసుకెళ్తారు. దాన్ని టవర్ ఆఫ్ సైలెన్స్ లేదా దఖ్మా అని పిలుస్తారు. రాబందులు వచ్చి తినేందుకు వీలుగా ఆ ప్రదేశంలో పార్థివదేహాన్ని ఉంచుతారు. ఈ మొత్తం పద్ధతిని దోఖ్‌మేనాశీనిగా పేర్కొంటారు. మన దేహం ప్రకృతి నుంచి వచ్చింది అలాగే తిరిగి ఐక్యమవ్వాలని వీరి ఆశయం. పార్సీల సంప్రదాయం ఇలా ఉన్నప్పటికీ..మారుతున్న పర్యావరణ పరిస్థితులు, రాబందుల సంఖ్య తగ్గిపోవడం వంటి సమస్యల కారణంగా దఖ్మా పద్ధతిలో అంత్యక్రియలు కష్టంగా మారింది. దీంతో సోలార్ లేదా విద్యుత్ విధానంలో దహన వాటికల్లోనే పార్సీలు అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. నీరు, అగ్ని, నేల కాలుష్యం కాకుండా జొరాస్ట్రియన్ నియమాలకు అనుగుణంగానే అంతిమ సంస్కారాలు కొనసాగిస్తున్నారు.రతన్ టాటా మరణించిన తర్వాత ఆయన అంత్యక్రియలు ఏ పద్ధతిలో జరుపుతారన్న దానిపై విస్తృత చర్చ జరిగింది. ఆయన పార్ధివ దేహం వద్ద పార్సీ, ముస్లిం, క్రిస్టియన్ , సిఖ్ అలాగే హిందూ మతాలకు చెందిన వారు ప్రార్థనలు చేస్తూ కనిపించారు. రతన్ టాటాకు నివాళులు అర్పించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు, వీఐపీలు ముంబైకి తరలి వచ్చారు రతన్ టాటా ఒక్క వ్యాపారవేత్తంగానే కాకుండా సేవతత్పరతో చాలా దేశ ప్రజల మన్ననలు పొందారు. అందుకే ఆయన లేరనే వార్త తెలిసిన తర్వాత అందరూ సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# కొండా సురేఖపై కేటీఆర్ దావా

## నాగార్జున కేసులో సురేఖకు కోర్టు నోటీసులు

**హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు):** మంత్రి కొండా సురేఖపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పరువు నష్టం దావా వేశారు. నాంపల్లి ప్రత్యేక కోర్టులో ఆయన తరఫు న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు దీనికి సంబంధించిన పిటిషన్ దాఖలు చేశారు. భారాస నేతలు బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు శ్రవణ్‌ను సాక్షులుగా పేర్కొన్నారు. ఇటీవల కొండా సురేఖ విలేకరులతో మాట్లాడుతూ సినీరంగంలోని పలువురిని ప్రస్తావిస్తూ కేటీఆర్‌పై ఆరోపణలు చేశారు. కొండా సురేఖపై ఇప్పటికే ప్రముఖ సినీనటుడు నాగార్జున క్రిమినల్ పరువు నష్టం దావా వేసిన సంగతి తెలిసిందే. ఆమె తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార వ్యాఖ్యలు చేశారని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. ఇదిలావుంటే నాగార్జున పిటిషన్ ఆధారంగా మంత్రి కొండా సురేఖకు నాంపల్లికోర్టు నోటీసులు జారీ చేసింది. తన కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై హీరో నాగార్జున నాంపల్లి కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ ఈనెల 8న కోర్టును కోరారు నాగార్జున. అలాగే వాంగ్మూలం కూడా ఇచ్చారు. సాక్షిగా సుప్రియ వాంగ్మూలాన్ని కోర్టు రికార్డు చేసుకుంది. ఆపై ఈరోజుకు విచారణను వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై నాంపల్లి స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు గురువారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖకు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను ఈనెల 23కు నాంపల్లి కోర్టు వాయిదా వేసింది.

# రుషితుల్యుడు..మన రతన్ టాటా!



భారతదేశం నిజంగానే పుణ్యదేశం... ఈ మట్టి మహిమేమో కానీ పలు సందర్భాల్లో పుణ్యపురుషులు ఉద్భవిస్తూనే ఉంటారు. మన అదృష్టం ఏమంటే రతన్ టాటా లాంటి ఓ పుణ్య పురుషుడిని మనతరంలో మనమంతా కళ్లముందు చూశాం. నమంతా ఇప్పుడు రతన్ టాటా అనే ఓ మహానుభావుడిని ప్రత్యక్షంగా చూశాం. ఆయన గురించి తెలుసుకున్నాం. ఆయన చర్యలను గమనించాం. ఆయన దేశం కోసం తపించి.. ఈ దేశ యువతకు మర్గనిర్దేశనం చేసేందుకు పడిన శ్రమను చూశాం. ఓ పారిశ్రామిక దిగ్గజంలా కాకుండా ఈ దేశాన్ని ముందుకు నడిపించే చోదకుడిలా టాటా ఎప్పుడూ ఆలోచించేవారు. ఇతర పారిశ్రామికవేత్తలకు రతన్ టాటా భిన్నం. ఆయన ఆలోచనలు భిన్నం. ఆయన నడవడి భిన్నం. ఆడంబరాలకు ఆయన దూరం. సన్మానాలంటే పెద్దగా ఇష్టం ఉండదు. రతన్ టాటా జీవితమంతా సింప్లిసిటీకి మారు పేరు. ఆయన జీవితాన్ని పరిశీలిస్తే రామాయణంలో జనకుని పాత్ర లాంటి ఎన్నో ఉదాహరణలు దొరుకుతాయి! అలాంటి ఓ మహానుభావుడు టాటా సంస్థను దిగ్గజ సంస్థగా ప్రపంచ వ్యాపార రంగంలో తీర్చి దిద్దారు. అలాగే నిజాయితీగా వ్యాపారం చేశారు. ఉప్ప నుంచి..విమానం వరకు సృషించని రంగాలు లేవు. నిజంగా యువతకు ఆయన ఓ రోల్ మోడల్. ఎలా ఎదగాలో..ఎలా మసలు కోవాలో..ఎలా వ్యాపారాన్ని నిజాయితీగా విస్తరించాలో అన్నదానికి కూడా ఆయన రోల్ మాడల్. తన వ్యాపారం కోసం ఏనాడూ రాజకీయ నేతల చుట్టూ తిరిగిన సందర్భాలు లేవు. ఆయన చుట్టే రాజకీయ నేతలు తిరిగి..తమ రాష్ట్రాల్లో వ్యాపారాన్ని పెట్టాలని అర్థించేవారు. రతన్ టాటా మరణంతో భారత దేశ పారిశ్రామిక చరిత్రలో ఒక శకం ముగిసింది! జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య యవనికపై తనదైన ముద్ర వేసిన పారిశ్రామిక వేత్త, చైర్మన్ ఎమెరిటస్ ఆఫ్ టాటా సన్స్.. రతన్ నావల్ టాటా (86) ఇక లేరు అన్న విషయం నిజంగానే జీర్ణించుకోలేని వార్త. దేశం కోసం తపించిన ఓ తపస్వి నింగికేగాడు. తన జ్ఞాపకాలను , తన వ్యాపార సామ్రాజ్యాన్ని మనకు వదిలేసి కనిపించని లోకాలకు చేరుకున్నాడు. ఎంతటి పుణ్యం చేసుకుంటే తప్ప ఇంత గొప్ప జన్మ దక్కదు. వంటగదిలో వాడే ఉప్పు నుంచి.. ఆకాశంలో ఎగిరే విమానాల దాకా.. ఎన్నెన్నో ఉత్పత్తులు, సేవలతో భారతీయుల నిత్యజీవితంలో భాగమైన టాటా సామ్రాజ్యాన్ని రెండు దశాబ్దాలపాటు నడిపించిన ఆ పారిశ్రామిక దిగ్గజం.. మరలిరాని లోకాలకు తరలిపోయారు! అత్యంత నిరాడంబరంగా జీవించిన రతన్ టాటా అవివాహితుడు. ముంబయిలోని అత్యంత చిన్న ఇంట్లో ఆయన నివసించేవారు. తన టాటా సెడాన్ కారును ఆయనే నడిపేవారు. ప్రైవసీని ఎక్కువగా ఇష్టపడేవారు. మీడియా ప్రచారానికి దూరంగా ఉండేవారు. తనతోపాటు పుస్తకాలను, సీడీలను, పెంపుడు కుక్కలను ఉంచుకునేవారు. రతన్ టాటా సేవాగుణంలో అత్యున్నతుడు. 1970లలోనే ఆయన సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. ఆగాఖాన్ ఆసుపత్రి, వైద్య కళాశాలకు శ్రీకారం చుట్టారు. 1991లో ఆయన టాటా సన్స్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక, టాటా గ్రూప్ సేవా కార్యక్రమాలు కొత్త రూపును సంతరించుకున్నాయి. టాటా ట్రస్టులను మరింతగా విస్తరించారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌ను స్థాపించారు. విద్యా రంగానికి మరింత ప్రోత్సాహమిచ్చారు. దేశంలోని అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యానికి అధినేత రతన్‌టాటా. కానీ, ఆయన ఎంతో వినయంగా ఉంటారు. ప్రచారాలకు, ఆర్భాటాలకు దూరంగా.. సాధారణ జీవనశైలితో ఉండటానికి ఇష్టపడతారు. రతన్ టాటా నాయకత్వంలో.. టాటా గ్రూప్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది, జాగ్వార్, ల్యాండ్ రోవర్, కోరస్ స్టీల్ వంటి పెద్ద పెద్ద కంపెనీలను కొనుగోలు చేసింది. ఆయన టాటా కంపెనీని బహుళజాతి కంపెనీగా మార్చారు. సంస్థ విలువను నిలుపుకుంటూనే టాటా గ్రూప్‌ను ప్రపంచ బ్రాండ్‌గా మార్చారు. రతన్ టాటా దాతృత్వానికి పెట్టింది పేరు. టాటా గ్రూప్ సంపదలో అధిక భాగం టాటా ట్రస్ట్‌ల ద్వారా ధార్మిక కార్యక్రమాలకు కేటాయించేవారు. ఆయన ఎల్లప్పుడూ నైతిక వ్యాపార పద్ధతులను పాటిస్తూ.. సామాజిక బాధ్యత తీసుకోవాలని చెబుతుంటారు. రతన్ టాటా ఎప్పుడూ వినూత్నంగా ఆలోచించేవారు. ఆయన తీసుకున్న ఎన్నో సాహసోపేత నిర్ణయాలు సంస్థను ముందుకు తీసుకెళ్లేందుకు దోహదపడ్డాయి. ప్రపంచంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలలో రతన్ టాటా ఒకరు. అయితే ఆయన చెప్పుకో దగ్గ వ్యాపార దిగ్గజాలతో కలసి ఎక్కడా కనిపించే వారు కాదు. ఉప్పు నుంచి ఉక్కు వరకు టాటాలు ప్రవేశించని రంగమే లేదు. ఏ వ్యాపారమైనా నాణ్యతే, నమ్మకమే లక్ష్యంగా అంచెలంచెలుగా ఎదిగిన టాటా గ్రూప్ ప్రస్థానంలో రతన్ టాటా కృషి అసామాన్యమైనది. ఆయన దగ్గరుండి వ్యవపారాన్ని నమ్మంతో ముందుకు నడిపించారు. టాటా ఉత్పత్తి అంటే నమ్మకం అన్న భావన కలిగించారు. అది భారతీయుల్లో విడదీయరాని బంధంగా మారింది. అత్యంత సాధారణ జీవితం గడుపుతూనే 6 ఖండాల్లోని వందదేశాల్లో టాటా గ్రూపునకు చెందిన 30 కంపెనీలకు ఆయన నేతృత్వం వహించారు. నిత్య మార్గదర్శకుడిగా, దాతృత్వశీలిగా, మానవతావాదిగా నిలిచిన రతన్ టాటా.. ప్రపంచంలోనే దిగ్గజ వ్యాపారవేత్తల్లో ఒకరిగా ఎదిగారు. రతన్ టాటా ఎప్పుడూ లాభాల కంటే చిత్తశుద్ధికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. ఆయన ఎంతో వినయంగా ఉంటారు. ప్రచారాలకు, ఆర్భాటాలకు దూరంగా.. సాధారణ జీవనశైలితో ఉండటానికి ఇష్ట పడతారు. రతన్ టాటాకు ఉన్న ఈ ప్రత్యేక లక్షణాలే ఆయనను కార్పొరేట్ టైటాన్‌గా నిలబెట్టాయి. కార్ల రంగంలో దిగ్గజ కంపెనీగా నిలబెట్టినా.. సామాన్యులకు కారును అందుబాటులోకి తీసుకుని రావాలని తపించారు. ఆయన తపనలోంచి వచ్చిందే నానో కారు. కేవలం లక్షకే నానో కారును మార్కెట్లో ప్రవేశ పెట్టారు. అలా రతన్ టాటా 2009లో సామాన్యుల కోసం రూ. లక్షకే నానో పేరుతో చీపెస్ట్ కారును మార్కెట్లోకి తీసుకొచ్చారు. ప్రజలపట్ల ఉన్న ప్రేమకు ఇది నిదర్శనంగా చూడాలి. ఇలా చెప్పుకుంటూ పోతే ఆయన గొప్పతనం అంతాఇంతాకాదు. ఆయన మన నేలపై నడయాడిన ఓ రుషితుల్యుడు.

# నానో కారు వెనక సామాజిక ప్రయోజనం

### పేద మధ్యతరగతి ప్రజల అవస్థలకు ప్రతిరూపం స్వయంగా ఉద్దేశ్యాలను వెల్లడించిన రతన్ టాటా




ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నానో కారు ఆవిష్కరణ వెనక కూడా టాటా సేవాదృక్పథం దాగి ఉంది. ఒక సందర్భంలో ఆయన తన ఇన్‌స్టా పోస్టులో ఆ కారు తయారీ వెనక ఉన్న ఆలోచనను పంచుకొన్నారు. నానో లాంటి వాహనాలను తయారుచేయాలన్న కోరిక వెనక నాకు ప్రేరణ ఏంటంటే.. చాలా కుటుంబాలు తరచూ తమ పిల్లలతో కలిసి స్కూటర్లపై వెళ్లడాన్ని నేను చూస్తుండేవాడిని. తల్లీతండ్రి మధ్యలో కూర్చున్న పిల్లలు నలిగిపోతున్నారేమో అని నా మనసుకు అనిపించింది. గుంతలుగా ఉండే రోడ్లపైనా వారు అలాగే ప్రయాణించడం చూసి నాకో ఆలోచన తట్టింది. ముందు మేం ద్విచక్ర వాహనాలను ఎలా భద్రంగా మార్చాలనే దానిపై దృష్టిపెట్టాం. ఆ తర్వాత నాలుగు చక్రాలు ఉండి.. కిటికీలు, డోర్లు లేకుండా కేవలం బగ్గీల్లాంటి వాహనాలను రూపొందించాలను కున్నాం. కానీ చివరకు కారునే తయారుచేయాలని నేను నిర్ణయించుకున్నా. 'నానో' ఎప్పటికీ మన ప్రజల కోసమే అని రతన్ టాటా రాసుకొచ్చారు. వీవీఐపీలు, సెలబ్రిటీలు నిత్యం వచ్చే తాజ్‌మహల్ హోటల్ ప్రవేశ ద్వారం వద్ద వీధి శునకం నిద్రిస్తుండటాన్ని కొన్నాళ్ల క్రితం ప్రముఖ హెచ్‌ఆర్ నిపుణురాలు రుబీఖాన్ గమనించారు. నాడు హోటల్ సిబ్బందిని అడగ్గా.. 'ఆ శునకం పుట్టినప్పటి నుంచి అక్కడే పెరిగింది. హోటల్‌లో ఓ భాగమైపోయింది. అక్కడికి వచ్చే ఏ మూగజీవాన్నైనా జాగ్రత్తగా చూసుకోవాలని రతన్‌టాటా నుంచి విస్పష్టమైన ఆదేశాలున్నాయి అని వెల్లడించినట్లు రాసుకొచ్చారు. చాలామంది అతిథులు అసలు దానిని గమనించి ఉండరన్నారు. ఇంత గందరగోళం మధ్య కూడా ఆ ప్రదేశాన్ని అది సొంతదిగా భావించిందని ముచ్చటపడ్డారు. ఈ విషయాన్ని నాడు లింక్డ్‌ఇన్‌లో పంచుకొన్నారు. టాటాల వ్యాపార సామ్రాజ్య రాజధానిగా భావించే బాంబే హౌస్‌లోనే వీధి శునకాలకు ఆయన ప్రత్యేకంగా ఉండేందుకు గదులను ఏర్పాటు చేశారు. ఏదైనా శునకం కష్టాల్లో ఉంటే.. దానిని ఎవరైనా దత్తత తీసుకోవాలని ఆయన తన సామాజిక మాధ్యమ ఖాతాల నుంచి విజ్ఞప్తి చేస్తుంటారు. కొవిడ్‌ను సాకుగా చూపి కంపెనీలు కష్టకాలంలో ఉద్యోగులను వదిలించుకొనే విధానంపై ఆయన గళం విప్పారు. ఓ ఆంగ్ల పత్రికతో నాడు మాట్లాడుతూ.. ఇది నష్టాలు వస్తున్నందుకు కంపెనీలు చేస్తున్నది కాదు.. వారిని రోడ్డున పడేస్తే కంపెనీల సమస్యలు తీరతాయా అని ప్రశ్నించారు. ఉద్యోగులను తొలగించకుండా సరైన దిశలో ఆలోచించి చర్యలు తీసుకొంటే ఈ కష్టం నుంచి బయటపడొచ్చని పేర్కొన్నారు. కొవిడ్‌తో పోరాడేందుకు ఆయన ఏకంగా రూ.500 కోట్ల నిధులను కేటాయించారు. 26/11 ముంబయి ఉగ్రదాడిలో తాజ్‌మహల్ హోటల్ సిబ్బంది 11 మంది ప్రాణాలు కోల్పోయారు. నాడు స్వయంగా రతన్‌టాటా గాయపడిన, చనిపోయిన వారి కుటుంబాలను సందర్శించి.. వారి పిల్లల చదువు బాధ్యతలను టాటా గ్రూప్ చూసుకొంటుందని భరోసా ఇచ్చారు. చనిపోయిన వారికి మిగిలిన జీవిత కాలంలో ఉద్యోగంలో వచ్చే జీతాన్ని ఆ కుటుబాలకు చెల్లించారు. తాజ్ పబ్లిక్ సర్వీస్ వెల్ఫేర్ గ్రూపును ప్రారంభించారు. రతన్ టాటా తన వద్ద పనిచేసి మానేసిన ఓ ఉద్యోగికి అనారోగ్యంగా ఉందని తెలుసుకొన్నాడు. ఆయనే స్వయంగా ముంబయి నుంచి పుణెకు వెళ్లి ఆ వ్యక్తిని కలిశారు. ఈ విషయం మూడో కంటికి తెలియనీయలేదు. చివరికి లింక్డ్‌ఇన్ పోస్టు ద్వారా వెలుగులోకి వచ్చింది. సాధారణంగా సంపన్నులు, బిజినెస్ టైకూన్లు కార్లలో వెనక సీట్లలో కూర్చొంటారు. కానీ, రతన్‌టాటా మాత్రం డ్రైవర్ పక్కనే కూర్చొని ప్రయాణాలను ఎంజాయ్ చేస్తారు. ఒక్కోసారి డ్రైవర్ లేకపోతే ఆయనే స్టీరింగ్ వీల్‌ను అందుకొంటారు. విమానాల్లో తరచూ ఆయన ఎకానమీ క్లాస్‌లోనే ప్రయాణిస్తుంటారు. ఆయనతో ప్రయాణికులు కలిసి దిగిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో కనిస్తుంటాయి. ఆన్‌లైన్‌లో విద్వేషం వ్యాప్తిపై రతన్ టాటా గతంలోనే గళం విప్పారు. ఈమేరకు ఇన్‌స్టాలో పోస్టు పెట్టి తన ఫాలోవర్లు వర్చ్యువల్ బుల్లియింగ్‌కు పాల్పడొద్దని పేర్కొన్నారు. ఇతరులపై అనవసరంగా తీర్పులు ఇవ్వొద్దని యువతకు సూచించారు.

# రతన్ టాటా మంచి పైలెట్

## 69 ఏళ్ల వయసులో ఫైటర్ జెట్ నడిపి రికార్డు

రతన్ టాటాకు స్పీడ్ కార్లంటే చాలా ఇష్టం. అందుకే ఆయన కంపెనీ నాణ్యమైన కార్లను ఉత్పత్తి చేసింది. సామాన్యుల కలల కారు నానో వచ్చింది. టాటా స్వయంగా పైలెట్ కూడా కావడంతో విమానాలు నడపాలన్న ఆసక్తితో పాటు..విమనరంగంలో టాటాలను దిగేలా చేసింది. ఆయన పేరిట అరుదైన రికార్డు ఉంది. ఆయన 69 ఏళ్ల వయసులో ఫైటర్ జెట్‌ను నడిపి సంచలనం సృష్టించారు. అమెరికా ఆయుధ తయారీ సంస్థ ఆయన్ను స్వయంగా ఎఫ్-16 నడపడానికి ఆహ్వానించింది. ఆయనకు జెట్ విమానాలు, హెలికాప్టర్లు నడిపేందుకు లైసెన్స్ కూడా ఉంది. 2007లో బెంగళూరులో ఏరో ఇండియా షో జరిగింది. దీనిలో లాక్‌హీడ్ మార్టిన్ కూడా తమ ఫైటర్‌జెట్లను ప్రదర్శించింది. నాడు ఆ సంస్థ టాటాను ఆ ÷ఫైటర్ విమానం నడిపేందుకు ఆహ్వానించింది. ఈ అవకాశాన్ని టాటా సంతోషంగా అందుకొన్నారు. ఈ ప్రయాణంలో ఆయన కోపైలట్‌గా వ్యహరించారు. దాదాపు అరగంటపాటు సాగిన ఈ అడ్వెంచర్‌లో లాక్‌హీడ్ పైలట్ విమానం కొద్దిదూరం నడిపి.. కంట్రోల్ టాటాకు అప్పగించారు. ఈ సమయంలో పైలట్ సాయంతో కొన్ని విన్యాసాలు కూడా చేశారు. వాస్తవానికి ఓ సందర్భంలో వీరి విమానం భూమికి కేవలం 500 అడుగుల ఎత్తులో 600 నాట్స్ వేగంతో దూసుకుపోయింది. ఆయనకు ఓ రెప్లికాను కూడా లాక్‌హీడ్ గిఫ్ట్‌గా ఇచ్చింది. ఆ మర్నాడే ఆయన బోయింగ్ సంస్థకు చెందిన ఎఫ్-18 సూపర్ హార్నెట్ విమానాన్ని నడపడం విశేషం. దాదాపు 69 ఏళ్ల తర్వాత విమానయాన సంస్థ ఎయిరిండియా తిరిగి రతన్ టాటా హయాంలోనే మాతృ సంస్థకు చేరుకొన్న విషయం తెలిసిందే.



# పంచాయతీ కార్యదర్శుల నూతన యూనియన్

**కల్లూరు -ప్రభాత సూర్యుడు** కల్లూరు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో కల్లూరు పంచాయతీ కార్యదర్శుల యూనియన్ ఎన్నుకోవడం జరిగింది.

గౌరవ అధ్యక్షులు -కె.రాంప్రసాద్ (కొర్లగూడెం )
అధ్యక్షులుజి.మహేష్(చిన్న కొరుకోండి)
ఉపాధ్యక్షులు: సి.హెచ్ నాగేశ్వరరావు( గోకవరం)
ప్రధాన కార్యదర్శి :: భూక్య. సైదులు నాయక్ (ముగ్గ వెంకటాపురం)
ట్రెజరర్ ::వై.శ్రీను(యజ్ఞ నారాయణపురం)
జాయింట్ సెక్రెటరీ::జె.సుధారాణి ( పోచారం)
కార్యవర్గ సభ్యులు:
పి శ్రీనివాసరావు,జె లక్ష్మణరావు,
కే .రమేష్ బాబు, యస్. రేవతి
ఏ .నర్మద లు ఎన్నుకోవడం జరిగింది.
ఈ కార్యక్రమం లో పంచాయతీ ఈ.వో నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



## దుర్గాదేవి అమ్మవారుకీ పట్టు వస్త్రాలు సమర్పించిన చిలకా మునిబాబు దంపతులు

**కల్లూరు -ప్రభాత సూర్యుడు** ముగ్గ వెంకటాపురం గ్రామ పంచాయితీ లో రామాలయం లో ఏర్పాటు చేసిన శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారి నవరాత్రులు ఉత్సవాల సందర్బంగా అమ్మా వారికీ పట్టు వస్త్రాలు సమర్పించిన ముగ్గ వెంకటాపురం గ్రామ పంచాయతీ కీ చెందిన హిందూ ధర్మం ప్రచార కమిటీ అధ్యక్షులు చిలకా మునిబాబు ఉషారాణి దంపతులు. నవ రాత్రులు లో బాగం గా ఎనిమిదవ రోజు దుర్గ మాత అలంకర్ణ చేసి అమ్మా వారికీ ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. చిలకా మునిబాబు ఆయన సతీమణి ఉషా రాణి తో పాటు గా ముగ్గు వెంకటాపురం మహిళా భక్తులు పాల్గొని ఊరు ప్రజలు పాడి పంటలతో ధన ధాన్యాలతో అభివృద్ధి చెందాలని అమ్మవారి కీ పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు, భవాని మాత కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రతన్ టాటా మరణంపై రేవంత్ దిగ్భ్రాంతి

## వ్యాపార రంగంలో విలువలకు పట్టం కట్టారని నివాళి

హైదరాబాద్,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): ప్రముఖ పారిశ్రామిక వేత్త, మానవతావాది రతన్ టాటా మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సిఎం కెసిఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈరోజు దేశం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన నిష్క్రమణ పారిశ్రామిక రంగానికే కాకుండా యావత్ దేశానికి తీరని లోటు అని అన్నారు. రతన్ టాటా వ్యాపార రంగంలో నిబద్ధతకు, విలువలకు కట్టుబడిన గొప్ప వ్యక్తిగానే కాకుండా దాతృత్వానికి ప్రతీక అని ముఖ్యమంత్రి కొనియాడారు. పద్మవిభూషణ్ సహా అనేక గౌరవ పురస్కారాలు అందుకున్న రతన్ టాటా ఇక మన మధ్య లేకపోవడం బాధకరమని అన్నారు. టాటా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎనలేని సేవలు అందించారని, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో విశిష్ట సేవలు అందించారని గుర్తుచేశారు. రతన్ టాటా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ.. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. టాటా చారిటబుల్ ట్రస్టు ద్వారా రతన్ టాటా ఎనలేని సేవలు అందించారని, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు రేవంత్. రతన్ టాటా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని అన్నారు.

# కెసిఆర్ సంతాపం

## అరుదైన పారిశ్రామికవేత్త అని నివాళి

హైదరాబాద్,అక్టోబర్10(ఆర్ఎన్ఎ):రతన్ టాటా మృతి పట్ల బీఆర్ఎస్ అధ్యక్షుడు , తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆర్థిక ప్రగతికి మానవత్వాన్ని అద్దిన అరుదైన పారిశ్రామిక వేత్త రతన్ టాటా అని, సమాజ హితుడుగా.. తాత్వికత, దార్శనిక కార్యాచరణ ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. భారత సమాజం గర్వించే ప్రపంచ వ్యాపార దిగ్గజం, పద్మ విభూషణ్ రతన్ టాటా అని పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రగతికి మానవీయ కోణాన్ని అద్దిన మానవతావాది, దార్శనికుడు, పరోపకారి రతన్ టాటా అని కేసీఆర్ కొనియాడారు. అభివృద్ధి ఫలాలు కింది స్థాయికి చేరుకోవాలనే సామాజిక ఆర్థిక తాత్వికతను సొంతం చేసుకున్న అరుదైన పారిశ్రామిక వేత్త రతన్ టాటా అని కేసీఆర్ తెలిపారు. సమాజ సంక్షేమం కోసం, రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తు కోసం జీవితకాలం తపించిన రతన్ టాటా ఆదర్శాలు, కార్యాచరణ ప్రపంచ ఆర్థిక పారిశ్రామిక రంగానికి దిక్సూచిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ ఆహ్వానం మేరకు ఒక కార్యక్రమానికి హాజరై., నూతన తెలంగాణ రాష్ట్రం అనతికాలంలో సాధిస్తున్న అభివృద్ధిని అభినందించడం, సాంకేతిక పారిశ్రామిక రంగాల్లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన దార్శనిక కార్యాచరణ పట్ల రతన్ టాటా ఆనందాన్ని వ్యక్తం చేయడం తెలంగాణకు గర్వకారణమని కేసీఆర్ స్మరించుకున్నారు. మానవతావాది రతన్ టాటా మృతి భారత పారిశ్రామిక రంగానికే కాకుండా సమాజ సంక్షేమాన్ని ప్రగతిని కాంక్షించే ప్రతి ఒక్కరికీ తీరని లోటని కేసీఆర్ అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించానని.. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## రాష్ట్ర ప్రజలకు కేటీఆర్ బతుకమ్మ శుభాకాంక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): తెలంగాణలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఎనిమిది రోజుల పాటు ఒక్కో పేరుతో బతుకమ్మను పేర్చి ఆడిపాడిన ఆడపడుచులు ఈరోజు సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొననున్నారు. ఈరోజుతో తెలంగాణలో బతుకమ్మ సంబరాలు ముగియనున్నాయి. సద్దుల బతుకమ్మ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలియజేశారు. తొలిరోజు ఎంగిపూల బతుకమ్మను పురస్కరించుకుని తెలంగాణ ఆడపడుచులకు శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్.. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా ఎక్స్ వేదికగా విషెష్ తెలిపారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక మన బతుకమ్మ పండుగని కేటీఆర్ అన్నారు. పూలను, ప్రకృతిని దేవుళ్లుగా కొలుస్తూ ఆడ బిడ్డలు ఆనందంగా జరుపుకునే అద్భుమైన పండుగన్నారు. దేశంలోనే ఎక్కడ లేని అరుదైన, అందమైన సంస్కృతి వారసత్వం మన బతుకమ్మ పండగ అని గుర్తుచేసుకున్నారు. చిన్న పెద్ద అని తేడా లేకుండా ఆడ బిడ్డలంతా ఎంతో సంతోషంగా ఈ ఘనమైన పండుగను జరుపుకుంటారన్నారు. ఆడబిడ్డల జీవితాల్లో బతుకమ్మ తల్లి మరిన్ని సంతోషాలు, వెలుగు నింపాలని కోరుకుంటున్నాని తెలుపుతూ ఆడబిడ్డలందరికీ కేటీఆర్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

# కష్టకాలంలో భారత్ సహకారం మరువలేం

### మాల్దీవులకు భారత్ అండగా నిలిచింది
### ప్రకటన విడుదల చేసిన మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు




మాలె అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): భారత్ అందించిన ఆర్థిక సహాయం, స్థిరమైన మద్దతుకు మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా క్లిష్టసమయంలో అండగా ఉన్నారంటూ వెల్లడించారు. ఈ మేరకు మీడియా ప్రకటన విడుదల చేశారు. ఐదురోజుల భారత్ పర్యటనను ముగించుకొని స్వదేశానికి చేరుకున్న సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఏడాది మాల్దీవుల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ముయిజ్జు భారత్‌లో అధికారిక పర్యటన చేయడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. రెండుదేశాల మధ్య స్నేహం, భాగస్వామ్యం బలోపేతం అయ్యే విధంగా ఈ చర్చలు జరిగాయని ముయిజ్జు తన ప్రకటనలో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. మోదీ–ముయిజ్జు భేటీ సందర్భంగా మాల్దీవుల అవసరాలకు దిల్లీ ప్రాధాన్య మిచ్చింది. భారత్, మాల్దీవుల బంధం శతాబ్దాలనాటిదని వ్యాఖ్యానించిన మోదీ.. ప్రతి సంక్షోభంలోనూ ఆ దేశానికి తొలుత ఆపన్నహస్తం అందిస్తున్నది దిల్లీయేనని గుర్తుచేసిన సంగతి తెలిసిందే. మాల్దీవులకు తాజాగా 40 కోట్ల డాలర్ల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. భారత్ సహకారంతో మాల్దీవుల్లో తలపెట్టిన పలు ఇతర అభివృద్ధి ప్రాజెక్టులనూ మోదీ, ముయిజ్జు సంయుక్తంగా ప్రారంభించారు. ఎగ్జిమ్ బ్యాంకు సౌజన్యంతో నిర్మించిన 700 సామాజిక గృహ యూనిట్లను ఆ దేశానికి భారత్ అప్పగించింది. విదేశీ మారక నిల్వల కొరతను అధిగమించడంలో మాల్దీవులకు దోహదపడేలా ఆ దేశంతో కరెన్సీ మార్పిడి ఒప్పందాన్ని దిల్లీ కుదుర్చుకుంది. మాల్దీవుల్లో ఓడరేవులు, రోడ్డు నెట్‌వర్కులు, పాఠశాలలు, గృహ ప్రాజెక్టుల నిర్మాణానికి సహకరించేందుకు ముందుకు వచ్చింది. ఆర్థిక, పర్యాటక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం అయ్యేవిధంగా..రూపే కార్డు చెల్లింపుల సేవలను ప్రారంభించిన సంగతి తెలిసిందే. వీటిని ఉద్దేశించే ముయిజ్జు తాజా స్పందన వచ్చింది. తమ దేశంలో పెట్టుబడులు పెంచేందుకు భారత్‌తో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కోసం ఎదురుచూస్తున్నామని మోదీతో సమావేశం అనంతరం ముయిజ్జు వెల్లడించిన సంగతి తెలిసిందే. తమ టూరిజం మార్కెట్‌కు భారత్ అతిపెద్ద సోర్స్ అని వెల్లడించిన ఆయన.. భవిష్యత్తులో టూరిస్టుల సంఖ్య పెరుగుతుందనే ఆశాభావం వ్యక్తంచేశారు.

## చెట్టును ఢీకొట్టిన కారు

### భారీగా ఎగిసిపడిన మంటలు

నారాయణపేట అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): కారు చెట్టును ఢీకొట్టగా భారీగా మంటలు ఎగిసిపడ్డ సంఘటన నారాయణపేట జిల్లా మాగనూరు మండల కేంద్రంలోని రోడ్డు క్యాంపు సమీపంలో గురువారం ఉదయం నాలుగు గంటల సమయంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట నుంచి మంత్రాలయంకు బయలుదేరిన కారు మాగనూరు మండల కేంద్రంలోని రోడ్డు క్యాంపు సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి చెట్టును ఢీకొట్టడంతో కారులో వేగంగా మంటలు వ్యాప్తి చెందాయి. అదృష్టవశాత్తు కార్ డోర్లు సకాలంలో ఓపెన్ కావడంతో అందులో పయనిస్తున్న కుటుంబ సభ్యులు బయట పడి ప్రాణాలు దక్కించుకున్నారు. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా వారు సంఘటన స్థలానికిచేరుకొని మంటలను ఆర్పేశారు. ప్రమాదం జరిగినప్పుడు కారులో నలుగురు చిన్నారులు, ముగ్గురు పెద్దవారు ఉన్నట్టు తెలిసింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రజలకు హరీశ్‌రావు బతుకమ్మ శుభాకాంక్షలు



హైదరాబాద్ అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలంగాణ ప్రజలకు, మహిళలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ మహిళలు అత్యంత ఇష్టపూర్వకంగా జరుపుకునే పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. పుష్పాలను పూజించి, ప్రేమించేది తెలంగాణ ప్రజలే. ప్రపంచ వ్యాప్తంగా బతుకమ్మ పండుగ ఎంతో ఖ్యాతిని సంపాదించింది. మన బతుకమ్మ పండుగను అమెరికా కూడా అధికారికంగా గుర్తించడం మనందరికీ గర్వకారణం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బతుకమ్మను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రతి బతుకమ్మ పండుగకు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ బతుకమ్మ పండుగ మీ జీవితంలో కొత్త వెలుగులు ప్రసాదించాలని, ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఆ అమ్మవారిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నానని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## కెసిఆర్‌ను విమర్శించకుండా ఉండలేరా

### విమర్శలే మీ ప్రభుత్వ విధానమా
### సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ సబిత



హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): ఎక్కడ పడితే అక్కడ.. విద్యార్థులు, టీచర్ల ముందు కేసీఆర్ ను విమర్శించడమే మీ విధానమా..? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా రెడ్డి సూటిగా ప్రశ్నించారు. గడిచిన పది నెలలలో కేసీఆర్ పేరు ఎత్తకుండా ఒక్క సభలో అయినా మాట్లాడారా..? అని అడిగారు. నిన్న డీఎస్సీ నియామక పత్రాల అందజేత సందర్భంగా కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి విమర్శించిన తీరుపై సబితా ఇంద్రారెడ్డి ఎక్స్ వేదికగా స్పందించారు. రేవంత్ రెడ్డి మాట్లాడేటప్పుడు అది ప్రభుత్వ కార్యక్రమా లేక పార్టీ కార్యక్రమా మర్చిపోతున్నారు. మీరు ఇచ్చాం అని చెప్తున్న టీచర్ పోస్టులు కేసీఆర్ మంజూరు చేసినవి కావా..? ఉన్నత విద్యాశాఖలో 3202 పోస్టులు, యూనివర్సిటీలలో 1081 పోస్టులు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసినవి కావా..? అని సబితా ఇంద్రారెడ్డి నిలదీశారు. ఇంటర్, టెక్నికల్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ సంబంధించి 3896 కాంట్రాక్టు ఉద్యోగులను కేసీఆర్ రెగ్యులర్ చేశారు అని చెప్తే బాగుండేది. ఎన్నికల ముందు మీరు చెప్పిన 25,000 టీచర్ పోస్టులు ఎందుకు ఇవ్వలేదు అని ఆ గురువుల ముందు చెప్తే బాగుండేది. ఎన్నికలప్పుడు 6000 పాఠశాలలు మూతపడ్డాయి అని అబద్ధం చెప్పిన మీరు, ఆ పాఠశాలల లిస్ట్ విడుదల చేస్తే బాగుండేది. మన ఊరు మన బడి కార్యక్రమం ఎందుకు ఆపేశారో చెప్తే బాగుండేది. 6 లక్షల మంది పేద విద్యార్థులు చదువుతున్న కేసీఆర్ ప్రవేశ పెట్టిన గురుకులాలను ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేద్దాం అనుకుంటున్నది అని చెప్తే బాగుండేది. ప్రభుత్వ పాఠశాలలో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ఎందుకు ఆపేశారో చెప్తే బాగుండేది. ఎన్నికల సమయంలో చెప్పినట్టు ప్రతి విద్యార్థికి 5 లక్షల విద్య భరోసా కార్డు ఎప్పుడు ఇస్తారో చెప్తే బాగుండేది. 19 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్న మీరు మిగితా పాఠశాలలను గాలికి వదిలేశాము అని చెప్తే బాగుండేది అని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు.



## దుర్గాదేవీగా విజయవాడ అమ్మవారు

విజయవాడ, అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): ఇంద్రకీలాద్రి పై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా ఎనిమిదవరోజు గురువారం అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. దుర్గాదేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. జై దుర్గా జై జై దుర్గ అన్న నామస్మరంతో ఇంద్రకీలాద్రి మారుమోగుతోంది. కాగా దుర్గమును దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భవానీలు వచ్చారు. దుర్ఘతలను పోగొట్టే దుర్గాదేవిని దర్శించుకుంటే సద్గతులు ప్రాప్తిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కాగా ఇంద్రకీలాద్రిపై దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మూలానక్షత్రం (అమ్మవారి జన్మనక్షత్రం) కావడంతో రాష్ట్ర నలుమూలల భారీగా తరలివచ్చారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. అన్ని క్యూలనూ ఉచితంగా వదిలేశారు. సామాన్య భక్తులతోపాటు, వీఐపీల తాకిడి ఎక్కువవ్వడంతో కొండ కిటకిటలాడింది. అమ్మవారు బుధవారం సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి ఆలయం మూసివేసే సమయానికి సుమారు 1.50 లక్షల నుంచి 2 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారని దుర్గగుడి అధికారుల అంచనా. సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి లోకేశ్ దంపతులు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. శరన్నవరాత్రి మహోత్సవాలలో అత్యంత కీలకమైన మూలా నక్షత్రం నాడు ఎలాంటి వివాదాలు, ఆటంకాలు లేకుండా భక్తులు దుర్గమ్మను సరస్వతీ అలంకారంలో దర్శించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళిక, పోలీసు, రెవెన్యూ, దేవదాయశాఖల మధ్య సమన్వయం కారణంగా సామాన్య భక్తులు సైతం తమకు అసౌకర్యం కలిగిందని ఎక్కడా ఫిర్యాదులు రాకపోవడం విశేషం. మూలానక్షత్రంనాడు అన్ని టిక్కెట్ దర్శనాలను ఉచితం చేశారు. లక్షల్లో అమ్మవారిని దర్శించుకోవటానికి వచ్చిన భక్తులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలు రూపొందించటంలో.. క్యూలైన్ల క్రమబద్ధీకరణలో అన్ని శాఖలు విజయం సాధించాయి.

## హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

హైదరాబాద్ అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): సుప్రీంకోర్టు సౌత్ ఇండియా రీజినల్ బెంచ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇదే డిమాండ్‌తో దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నా పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. బుధవారం నల్లకుంటలోని కార్యాలయంలో సుప్రీంకోర్టు న్యాయవాది వినాయక్‌రావు, హైకోర్టు న్యాయవాది భూపాల్‌రాజ్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు రీజినల్ బెంచ్ సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 10న మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నల్లకుంటలోని దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. సమావేశానికి సుప్రీంకోర్టు న్యాయ వాదులు, మేధావులు, పలువురు ప్రముఖులు హాజరవుతారని ఆయన తెలిపారు.

## ఆక్రమణల ఫిర్యాదుపై అధికారుల విచారణ

హైదరాబాద్ అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 36 నాలా ఆక్రమణకు గురైందనే ఫిర్యాదుల నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు విచారణ చేపట్టారు. జూబ్లీహిల్స్‌లో కొన్నిచోట్ల నాలా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని, మరికొన్ని ప్రాంతాల్లో నాలా కుంచించుకుపోయిందని హైడ్రాకు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. ఇందులో వాస్తవాలు తేల్చి తగిన చర్యలు తీసుకోవాలని హైడ్రా జీహెచ్ఎంసీని కోరింది. దీంతో ముగ్గురు ఇంజనీరింగ్ అధికారులు రోడ్డు నంబరు 36లో పర్యటించారు. జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ వద్ద నాలా ఆక్రమణకు గురైనట్టు అధికారులు నిర్ధారించారు. అనంతరం నాలా వెడల్పును తగ్గిస్తూ వ్యాపార సముదాయాలు వెలిసినట్టు తేలింది. కొన్ని ప్రాంతాల్లో నాలా కనిపించకుండా పోయినట్టు అధికారులు గుర్తించారు. ఈ అంశాలపై అధికారులు నివేదిక రూపొందించి హైడ్రాకు అందించనున్నారు.


## ఒకే ఇంట్లో నలుగురు డాక్టర్లు

### నలుగురు ఆడపిల్లలకు ఎంబిబిఎస్ సీట్లు

సిద్దిపేట, అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): ఒకే ఇంట్లో నలుగురు డాక్టర్లు కాబోతున్నారు. సిద్దిపేటకు చెందిన కొంక రామచంద్రం, శారద దంపతుల నలుగురు కుమార్తెలు. వీరంతా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీట్లు పొందారు. పెద్ద కుమార్తె మమత 2018లో ఎంబీబీఎస్ సీట్ పొంది చదువు పూర్తి చేసి డాక్టర్ కాగా..రెండో కుమార్తె మాధవి 2020లో ఎంబీబీఎస్‌లో అడ్మిషన్ పొంది చదువుతున్నది.ఈ సంవత్సరం మరో ఇద్దరు కుమార్తెలు రోహిణి, రోషిణి ఎంబీబీఎస్‌లో అడ్మిషన్ పొందారని, జిల్లాకో మెడికల్ కాలేజీ వచ్చినందుకు ఇది సాధ్యమైందని తండ్రి రామచంద్రం తెలిపాడు. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణ బిడ్డలు ఇక్కడే ఎంబీబీఎస్ చదువుతున్నారని, ప్రత్యేక తెలంగాణ వల్లే ఇది సాధ్యమైందని సంతోషంగా తెలిపారు. ఈ మేరకు రామచంద్రం తన కుటుంబ సభ్యులతో కలిసి మాజీ మంత్రి హరీశ్ రావును కలిశారు. నలుగురు ఎంబీబీఎస్ సీట్లను పొందడం గర్వంగా ఉందని, తల్లిదండ్రుల కలలను సాకారం చేశారని హరీశ్ రావు పిల్లలను అభినందించాడు.

## హర్యానా ఫలితాలపై కాంగ్రెస్ అంతర్మథనం

### ఓటమి కారణాలపై నిజనిర్ధారణ కమిటీకి నిర్ణయం



న్యూఢిల్లీ, అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు భిన్నంగా హరియాణాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయం పాలైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కాంగ్రెస్ ఓటమికి గల కారణాలు తెలుసుకునేందుకు అన్వేషిస్తుంది. అందులో భాగంగానే నిజనిర్ధారణ కమిటీని ఏర్పటు చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు పలు మీడియా కథనాలు ఉటంకిస్తున్నాయి. 'మేము హరియాణా ఎన్నికల ఫలితాలపై సమీక్షా సమావేశం నిర్వహించాం. ఎగ్జిట్ పోల్స్‌కు, ఫలితాలకు చాలా వ్యత్యాసం ఉంది.' అని రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఏఐసీసీ అబ్జర్వర్ అజయ్ మాకెన్ పేర్కొన్నారు. హరియాణా ఎన్నికల్లో వరుసగా మూడోసారి భాజపా విజయం సాధించిన విషయం తెలిసిందే. మొత్తం 90 సీట్లలో 48 చోట్ల విజయ కేతనం ఎగురవేసింది. కౌంటింగ్ ప్రారంభంలో కాంగ్రెస్ ఆధిక్యంలో ఉన్నప్పటికీ.. 37 స్థానాలకే పరిమితమైంది. అయితే, ఈ ఫలితాలపై కాంగ్రెస్ నేతలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈసీ పనితీరుతో పాటు ఈవీఎంలపైనా పలు ఆరోపణలు చేశారు. ఫలితాల అనంతరం.. హరియాణాలో అనూహ్య ఫలితాలపై విశ్లేషణ చేపట్టినట్లు కాంగ్రెస్ అగ్రనత రాహుల్ గాంధీ వెల్లడించారు.

## జగిత్యాల జిల్లాలో విషాదం

### ఆర్టీసీ బస్సు ఢీకొని హెూంగార్డు మృతి

జగిత్యాల అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): జగిత్యాల జిల్లాలో పండుగపూట విషాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు ఢీ కొని హెూంగార్డు మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన మెట్‌పల్లి పట్టణ శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెట్‌పల్లి పట్టణానికి చెందిన హెూంగార్డు సుబ్బరాజు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. కాగా, సుబ్బరాజు ఓ హెూటల్‌లో టిఫిన్ తీసుకొని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా నిజామాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు సుబ్బరాజు బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో హెూంగార్డు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సుబ్బరాజు మృతితో బంధువుల రోదనలు మిన్నంటాయి.

## అక్రమంగా గృహ నిర్బంధం చేసే అధికారం కాంగ్రెస్‌కు లేదు

### బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ

హైదరాబాద్ అక్టోబర్ 10 (ప్రభాత సూర్యుడు): హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతిపక్ష పార్టీ నేతలను అక్రమంగా గృహ నిర్బంధం చేసే అధికారం లేదని బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ విమర్శించారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం సాగుతున్నదని ధ్వజమెత్తారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన ఉపాధ్యాయ నియామక పత్రాల పంపిణీ నేపథ్యంలో ప్రతిపక్ష పారీల నిరసన కార్యక్రమాలు చేపట్టకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సెంట్రల్ జోన్ డీసీపీ, చిక్కడపల్లి ఏసీపీ ఆదేశాల మేరకు ముషీరాబాద్ సీఐ రాంబాబు ఆధ్వర్యంలో పోలీసులు ముఠా జైసింహ, ఆయన అనుచరులను గాంధీనగర్‌లోని నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులను చూసి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. కారణం చూపకుండా పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడం ఎంత వరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గంలో బుధవారం తాను అనేక అమ్మవారి పూజలు, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉండగా, పోలీసులు తనను హౌస్ అరెస్ట్ చేయడంతో తన అభిమానులు, అనుచరులు, కార్యకర్తలు తీవ్ర నిరాశకు గురయ్యారని వాపోయారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 2 లక్షల వరకు వెంటనే రుణమాఫీ చేయాలని, వర్షాకాలం రైతుబంధు నిధులు విడుదల చేయాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని, మహిళలకు మహాలక్ష్మి పథకం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసే వరకు కేసీఆర్, కేటీఆర్‌ల నాయకత్వంలో తమ పోరాటం కొనసా గుతుందన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Akshaya Printers, H.No:7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City, Telangana. Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505, Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215